క్లుప్తంగా

తండ్రి సమాధికి ఎమ్మెల్యే నివాళులు


తండ్రి సమాధి దగ్గర నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లిలో ఎమ్మెల్యే జోగారావు తన తండ్రి ఎ.సత్యం సమాధి దగ్గర ఆదివారం నివాళులర్పించారు. తండ్రి 16వ వర్ధంతి సందర్భంగా స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆయన నివాళులర్పించారు. గతంలో చిలకలపల్లి సర్పంచ్‌గా తండ్రి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సర్పంచ్ సుందరరావు, దాసు, ప్రభాకరరావు, మోహనరావు, కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఫకృద్దీన్

పాచిపెంట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఫకృద్దీన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా పాచిపెంటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై వెంకటరమణ పాలకొండ నియోజకవర్గం వీరఘట్టాం పీఎస్‌కు బదిలీపై వెళ్లారు.

సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సమగ్ర 'భూరక్ష'-'భూ హక్కు'సర్వే పనుల్లో పాల్గొనేందుకు గ్రామాలకు వస్తున్న రెవెన్యూ, సర్వే అధికార సిబ్బందికి రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎన్వీరమణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు గ్రామాల్లో దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్న సంకల్పంతో ప్రభుత్వం భూ రక్ష, భూ హక్కు పథకాన్ని అమలు చేసిందన్నారు. రెండు సర్వేలు పూర్తి చేసిన గ్రామాల భూముల్లో రోవర్ విధానం ద్వారా సర్వే రాళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాళ్ల అమర్చే సమయంలో భూములకు చెందిన రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిధులతో సమకూర్చిన సర్వే రాళ్లను రైతులు పదిలం చేసుకున్నప్పుడే భూ వివాదాలను నిరోధించవచ్చని తహసీల్దార్ ఎన్వీరమణ అన్నారు. భూముల్లో రీ సర్వే నిర్వహించడానికి, సర్వే రాళ్ల వేయడానికి రెవెన్యూ, సర్వే సిబ్బంది గ్రామాలకు వస్తున్నట్లు తెలియజేశారు.

8న దివంగత వైఎస్సార్ విగ్రహావిష్కరణ


విగ్రహ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని జూలై 8వ తేదీన పార్వతీపురం పట్టణంలో ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న వైఎస్సార్ విగ్రహ నిర్మాణం ఏర్పాట్లను ఆదివారం ఆయన దగ్గర ఉండి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ 10 అడుగుల భారీ విగ్రహం ఏర్పాటుతో ఒక వైపు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం, మరో వైపు పార్వతీపురం నియోజకవర్గం కొత్తశోభ సంతరించుకోనున్నాయని తెలిపారు. మరో రెండు రోజుల్లో వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమం కార్యాచరణను ఖరారు చేసి పార్టీ శ్రేణులకు పిలుపు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తులు పాల్గొన్నారు.

విధినిర్వహణలో చిత్తశుద్ధి

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్జీదారులకు అందించాల్సిన ధ్రువపత్రాలు సిద్ధం చేయటంలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. డిప్యూటీ తహసిల్దార్ బి.బుచ్చయ్య నేతృత్వంలో అధికారులు, సిబ్బంది దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ప్రజలు కోరుతున్న కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు భూ సంబంధిత పాస్ పుస్తకాలు, ముటేషన్లకు సంబంధించిన పత్రాలు సిద్ధం చేసేందుకు ఆదివారం కూడా విధులకు హాజరయ్యారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే జోగారావు


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ప్రతిపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని, తెలుగుదేశం పార్టీ నాయకులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే జోగారావు ప్రజలకు హితవు పలికారు. ఈ మేరకు బలిజిపేట మండలం పెదపెంకిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ దళారీతనం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనపై నమ్మకం ఉంచి మరోసారి ఆయనను గెలిపించాలని కోరారు. దళారులు, సిఫార్సులు, నాయకుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు.

గడగడపకు కార్యక్రమంతో ప్రజల వద్దకు పాలన

గత ప్రభుత్వ హయాంలో ప్రజలు నాయకుల చుట్టూ ఏవిధంగా ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. జన్మభూమి కమిటీల జేబులు నింపినవారికే పథకం వర్తింపచేసేవారని అటువంటి నాయకులను, చంద్రబాబును నమ్మవద్దని హితవు పలికారు. ప్రజల వద్దకు పాలన అందించాలనే సంకల్పంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గడప ఎక్కి గడిచిన కాలంలో ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని తెలియపరచడం, అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటే అటువంటి వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు చేపట్టేందుకు గడపగడపకు వస్తున్నామన్నారు. కొత్తగా జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు శతశాతం సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీటీసీలు జి.సునీత, మల్లిక, సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, జి.జగన్, శ్రీనివాసరావు, జి.అప్పలనాయుడు మాస్టారు, టి.శ్రీనివాసరావు, జి.సత్యంనాయుడు, రమణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా భవనాలు


పెదంకలాంలో ఒకేచోట సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలు

సీతానగరం: ప్రజల అవసరాలకు అనుగుణంగా సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవననిర్మాణాలు మండలంలోని పెదంకలాంలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామని ఎంపీపీ బి.రమణమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె పెదంకలాంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాల్లో జరుగుతున్న విద్యుద్దీకరణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 21 సచివాలయాలు నిర్మించాల్సి ఉండగా లచ్చయ్యపేట మినహా 20 సచివాలయాల భవనాలకు గాను వెంకటాపురం, నిడగల్లు, గాదెలవలస, తామరఖండి, గెడ్డలుప్పి, పెదంకలాం, సూరంపేట, కాశీపేట, పెదభోగిలి 1, పెదభోగిలి 2, జోగింపేట సచివాలయం భవన నిర్మాణాలు పూర్తి కావడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ప్రారంభించడానికి నిర్వాహకులు సిద్ధం చేస్తున్నట్లు తెలియజేశారు. బూర్జ, గుచ్చిమి, లక్ష్మీపురం, ఆర్.వెంకంపేట సచివాలయ భవన నిర్మాణాలు వివిధస్థాయిల్లో ఉన్నాయని వివరించారు. నిర్వాహకులు పనులు పూర్తి చేయడానికి సిద్ధం చేస్తున్నారన్నారు.

బాధ్యత పెరిగింది..

- జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు


గిరి రఘు

సాలూరు: మున్సిపాలిటీ సచివాలయ కన్వీనర్‌గా నియమించడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవి అప్పగించిన మంత్రులు పీడిక రాజన్నదొర, బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం విశిష్టతను ఇంటింటికీ వివరిస్తానని చెప్పారు. మున్సిపాలిటీలో శనివారం ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమంలో దేవరవీధి సచివాలయంలో 549 సర్వీస్‌లు, కోటవీధి సచివాలయంలో 945 సర్వీస్‌లు అందించినట్లు తెలిపారు. మహంతివీధి, గాంధీనగర్ ప్రాంతాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

అందుబాటులో ఆరోగ్యం


గులిమి నేరేడు పండ్లు

- ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధ ఫలాలతో ఆరోగ్యం
- రసాయనాలు, క్రిమిసంహారక అవశేషాలు లేని మధుర ఫలాలు
- మార్కెట్లో మంచి డిమాండ్



బొప్పాయి ముక్కలు, జామికాయలు

భామిని: సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంత ముఖ్యమో సరైన ఆహారం తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆహారంలో వివిధ రకాల పండ్లు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి. రోజుకు ఒక పండు తింటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. క్రిమిసంహాలు, ఎరువులు వినియోగించకుండా ప్రకృతి ఒడిలో పండిన పండ్లయితే మరీ మంచిది. ఏజెన్సీ ప్రాంతంలో తివ్వాకొండల్లో ప్రకృతి సిద్ధంగా పండే పండ్లను గిరిజనులు ఆహారంగా తీసుకోవడంతో పాటు వాటిని విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో లభించే నేరేడు, జామ, బొప్పాయి, నారింజ, నిమ్మ, ఉసిరి, సపోటా, సీతాఫలం, అరటి, పైనాపిల్, పనస తదితర పండ్లకు మార్కెట్లో మంచి గిరాకి ఉంది. వీటిని తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ ఫలాలు వాటి ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం.

నేరేడు..

నేరేడు పండులో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిలోని శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తి మెరుగవడానికి తోడ్పడతాయి. సుగర్ వ్యాధి గ్రస్తులు వీటిని తీసుకోవడం ద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయి నియంత్రణలో ఉంచుకోవచ్చు.

నారింజ

ఇది సిట్రస్ జాతికి చెందిన ఫలం. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో అగ్రగామిగా ఉంటుంది.

నిమ్మ

ఇందులో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది వైరస్, బాక్టీరియాల నుంచి శరీరాన్ని కాపాడేందుకు చాలా అవసరం.

కొండ అరటి పళ్లు

ఏజెన్సీలో పండే అరటి పండ్ల రుచే వేరు. ఇందులో పోటాషియం అధిక మోతాదులో ఉంటుంది. వీటిని నిత్యం తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలోకి వస్తుంది.

జామ

జామలో విటమిన్-ఎ,సి అధికంగా ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. వయసు పైబడిన వారిలో వచ్చే కంటి సమస్యలను నివారించేందుకు ఉపకరిస్తుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల మలబద్ధకం సమస్య మాయమౌతుంది.

బొప్పాయి

బొప్పాయిలో పెపైన్ అనే ఎంజైమ్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీని వల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవడంతో పాటు అందులోని పోషకాలు రక్తంలోకి చేరడంతో శరీరానికి శక్తినివ్వడంతో పాటు రోగనిరోధక శక్తిని ప్రభావవంతంగా ఉంచుతుంది.

ఉసిరి

ఉసిరిలో యాంటీ బాక్టీరియల్, రక్తస్రావ నివారిణి లక్షణాలు ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచే గొప్ప ఔషధం. సీ-విటమిన్ అధికంగా ఉంటుంది.

పండ్లతో ఆరోగ్యం పదిలం



కృత్రిమ రసాయనాలు లేని స్వచ్ఛంగా పండిన ఫలాలు ఆరోగ్యానికి మంచిది. ఏజెన్సీలో ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లలో ఎటువంటి క్రిమిసంహారకాలు, ఎరువుల అవశేషాలు లేకుండా స్వచ్ఛంగా ఉంటాయి. ఇవి రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మంచివి. ప్రతి రోజు పండ్లను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.

– డాక్టర్ కె.విజయపార్వతీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ, పాలకొండ

వేతనదారుల హర్షం

- వేతనం రూ.257నుంచి రూ.272కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- నియోజక్వర్గంలో 90,409 మందికి ప్రయోజనం

నియోజకవర్గంలో వేతనదారుల వివరాలు	
మండలం	వేతనదారులు
పార్వతీపురం	32138
బలిజిపేట	29379
సీతానగరం	28892


పార్వతీపురం మండలంలో ఉపాధిపనులు చేస్తున్న వేతనదారులు

పార్వతీపురంటౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతనదారుల వేతనం పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పార్వతీపురం నియోజకవర్గంలో వేతనదారులకు ఇప్పటివరకు వేతనదారులకు గరిష్ఠంగా రోజుకు రూ.257 చెల్లిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం మరో రూ.15 పెంచడంతో ఏప్రిల్ 1 నుంచి రూ.272 వేతనం చెల్లిస్తారు. ఉపాధి వేతనాల పెంపుదల పట్ల వేతనదారులు సంతోషం వ్యక్తమవుతున్నారు.

వేతనం పెంపుతో ప్రయోజనం

ఏప్రిల్ 1 నుంచి ఉపాధి హామీ వేతనదారులకు ఇచ్చే దినసరి వేతనం పెంపుతో ఎంతో ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో అత్యధిక పనిదినాలు కల్పించేలా డ్వామా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. వేసవిని దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.



– రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

అభ్యంతరాలు తెలియజేయండి

- ఏఓ తిరుపతిరావు


పాంచాలి ఆర్‌బీకే వద్ద అర్హుల జాబితాను పరిశీలిస్తున్న ఏఓ తిరుపతిరావు

పాచిపెంట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమాపై రైతులకు అభ్యంతరాలుంటే తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి కె. తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలి, మోసూరు రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించిన పంటల బీమా జాబితాను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో ఎంతమంది రైతులకు ఉచిత పంటల బీమా వచ్చిందనే జాబితాను ఆయా రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించాలని విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను ఆదేశించారు. పరిహారం మంజూరకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 4వ తేదీ లోపు రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల వద్ద తెలియజేయాలన్నారు. ఇప్పటికి మండలంలో మొక్కజొన్న పంటకు సంబంధించి 3005 మంది రైతులకు.. అలాగే 117 మంది అరటి రైతులకు పరిహారం మంజూరైనట్లు తెలిపారు. ఈ డబ్బులు జులై 8వ తేదీన నేరుగా రైతులు ఖాతాలో జమవుతాయన్నారు.

మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయుచున్న దొగ్గ మోహనరావు, కార్యదర్శి పసుమర్తి వెంకటప్రసాద్ (బుజ్జి), కోశాధికారి జంబలి కేశవరావు ఇతర కార్యవర్గ సభ్యులను అభినందిస్తూ వారందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురంలో గల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం తెగించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, నిజంగా అది ఎప్పటికీ ఎవరూ మర్చిపోలేరన్నారు. అలాగే అక్షయపాత్ర కార్యక్రమం ద్వారా ఎంతో మంది అభాగ్యులు, రోగులకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో అన్నదానం చేస్తూ సుమారు 200 రోజులు పైబడి ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తుండడం గొప్ప విషయమని ప్రశంసించారు. పార్వతీపురం చెరువుగట్టు ప్రాంతంలో ఉన్న 68 మంది పాచిపని చేసుకునే పేదవారికి ప్రభుత్వ సహకారంతో లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఇళ్లను సైతం కట్టి ఇస్తుండడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

- రుణపడి ఉంటామన్న లబ్ధిదారులు


సర్టిఫికెట్స్ అందిపుచ్చుకున్న మామిడి గిరి దంపతులు

సీతానగరం: నా పేరు మామిడి గిరి. మాది మండలంలోని బగ్గందొరవలస గ్రామం. పేదకుటుంబానికి చెందిన నాకు కుటుంబ జీవనం ఇబ్బందిగా ఉంది. రైస్ కార్డు మంజూరు చేయాలని గత ప్రభుత్వంలోనే వినతిపత్రాలు ఇచ్చాను. రేషన్ కార్డు కోసం దీర్ఘకాలంగా వినతిపత్రాలు ఇచ్చినా టెక్నికల్ సమస్యలతోనే కాలం గడిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలు చేయడంతో ఎటువంటి శ్రమలేకుండానే గ్రామవలంటీర్లు, గృహ సారథులకు సమస్య చెప్పిన వెంటనే సమస్య పరిష్కారమైంది. గ్రామసభలో తహసీల్దార్ ఎన్వీ రమణ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు రైస్‌కార్డుతో పాటు కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒక్క పైసా ఖర్చు లేకుండా అందజేశారు. మా కుటుంబం అంతా జగనన్నకు రుణపడి ఉంటాం.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ జానకీరాం

సీతానగరం:

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు అమలులో భాగంగా జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్లనిర్మాణం లబ్ధిదారులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ జానకీరాం కోరారు. మండలంలోని పణుకుపేటలో సర్పంచ్ బంకురు పద్మావతి అధ్యక్షతన ఆదివారం జగనన్న కాలనీ నిర్వాహకులతో సమీక్షాసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ జానకీరాం మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవ కారణంగా జగనన్న కాలనీల్లో, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం అర్హులైన వారికి 2,458 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పలుగ్రామాల్లో ఇప్పటికి 1426 ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గృహప్రవేశాలు చేశారని తెలిపారు. 16 గృహాలకు శ్లాబ్ పూర్తయిందని, 126 మంది లబ్ధిదారులు 9 అడుగుల స్థాయిలో గోడలు నిర్మించారని తెలియజేశారు. 423 మంది లబ్ధిదారులు పునాదుల వరకూ నిర్మాణం చేయగా, 467 మంది లబ్ధిదారులు భూమిపూజలతో నిలిపివేశారని చెప్పారు. ఈ మేరకు ఆర్థిక స్తోమత లేనివారికి రూ.20 వేలు వంతున రుణసదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బంకురు శ్రీహరినాయుడు, పూడు లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ బి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.